ఓం కారము (అక్షరబ్రహ్మ) వాక్యము

"ఓం" అనగా వాక్కు (శబ్దం). ఈ శబ్దాన్ని భగవద్గీత యందు "అక్షరం" అని వ్రాయబడింది. అక్షరము అనగా క్షయము కానిది.

భగవద్గీత - 8.11 వచనం

శ్లోకం : "యదక్షరం వేదవిదో వదంతి - యద్యతయో వీతరాగా ।
యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి తత్తేపదం సంగ్రహేణ ప్రవక్ష్యే

భావము : వేదవిద్వాంసులు పరమాత్మను (దేవుడు) అక్షరుడు అన్నారు. ఓంకారము (అక్షరం) పరమపదం. బ్రహ్మచర్య వ్రతం (సన్యాసులు) ఆచరించువారు ఈ పదమునే సాధన చేయుదురు.

బైబిలు : అక్షరం అనగా వాక్యం (శబ్దం) (యోహా 1:1). అక్షరం అను మాట నాశనంలేనిది, క్షయము కానిది, శాశ్వతం. దేవుడు శాశ్వతమైనవాడు. (ద్వితీ. 33:27). దేవుడు (యేసుక్రీస్తు) అక్షయుడు (రోమా 1:23; 1తిమోతి 1:17; 1తిమోతి 6:16 చూడుము).

నాశనరహితుడు, జీవవాక్యం, జీవాహారం, నిత్యజీవం, జీవజలము, జీవాధిపతి, సజీవుడు ఇవన్నియు యేసుక్రీస్తు యొక్క నామములు. అందుకే యేసుక్రీస్తు (అక్షరబ్రహ్మ) ఓంకార స్వరూపుడు.

✧ ✧ ✧

వాక్యమే దేవుడు

ఓం అనే ఈ వాక్యము (యేసుక్రీస్తు) దేవుడు అని వేదముల యందు వ్రాయబడింది.

కఠోపనిషత్ – 1:2:16.

శ్లోకము : ఏతద్ధ్యే వాక్షరం బ్రహ్మ, ఏతద్ధ్యేవాక్షరం పరమ్ ।
ఏతద్ధ్యేవాక్షరం జ్ఞాత్వా, యో యదిచ్ఛతి తస్యతత్ ॥

భావము : అక్షరమే బ్రహ్మము (దేవుడు) అక్షరమే పరలోకము, అక్షరమే (వాక్యము) జ్ఞానము, ఈ అక్షరమును (వాక్యం) జపించుచు

పరమాత్మను చింతనచేయవలెను.

బైబిలు : వాక్యమే (అక్షరం) దేవుడు. యేసుక్రీస్తునకు దేవుని వాక్యం (అక్షరబ్రహ్మ) అను పేరుకలదు ప్రక 19:13. జీవ వాక్యం 1 యోహా 1:1. పూర్వము ఈ వాక్యం (అక్షరం) దేవుని దగ్గర ఉన్నాడు యెష 48:16. ఆ తరువాత ఈ (అక్షరం) వాక్యం యూదులకు ప్రత్యక్షమైనది. రోమా 3:2 ప్రకారము మొదట దేవోక్తులు యూదుల పరముచేయబడి, యూదులలో నుండి అహరోను, అహరోను సంతతి నుండి ఆర్యులు, ఆర్యులు ద్వారా దేవోక్తులు వ్రాయబడ్డాయి. ఆదేవోక్తులే బైబిలు గ్రంథము.

"వైదికమతం" ఇది ఆర్యుల మతము. భారతదేశంలో 3 వేల సంవత్సరాలకు పూర్వము ఆవిర్భవించింది. ఈ వైదికమునే "వేదము" అని చెప్పబడినది.

❖ ❖ ❖

దైవ దర్శనం

(దేవుని చూడగలమా ?)

ఈనాడు అనేకమంది (చాలామంది క్రైస్తవులు కూడా) దేవుని చూశామని, ముఖాముఖిగా కనిపించాడని, స్వయంగా చూశామని చెప్పగా విన్నాను, వింటున్నాము. దేవుడు ఎలా ఉంటాడు అని వారిని అడిగితే సరయిన జవాబియ్యక తడబడతారు.

ఎవరూ దేవుని చూడలేదు ? కారణం ఏమిటి ?

బైబిలు చెబుతున్న సత్యం నిర్గమ 33:20-23. నన్ను (దేవుని) చూచిన ఏ నరుడూ బ్రతకడు, చనిపోతాడు. "నేనాయనను చూడగా చచ్చిన వానివలె ఆయన పాదముల యొద్ద పడితిని" ప్రకటన 1:17.

యోహాను 1:18 ప్రకారము "ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు"

యోహాను 6:46 ఎవడును తండ్రి (దేవుని)ని చూసి యుండలేదు.

బైబిలు నందు తిమోతి భక్తుడు చక్కగా వివరించాడు. 1 తిమోతి 1:16 - మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు (చూడనేరడు అంటే మానవుడు భూమిమీద ఉన్నంతకాలము ఎవడును చూడలేదు).

1 యోహాను 4:12 ఏ మానవుడును దేవుని ఎప్పుడు చూచి యుండలేదు.

పూర్వకాలములో దేవుడు తనని తాను కనపరచుకున్నాడు ఎలా ? బైబిల్ ఆధారములు : లేవి 9:4; మీకు కనబడును. ఎలా కనబడ్డాడు లేవి 9:6 "మహిమ" వారికి కనబడెను. లేవి 9:23లో దేవుని మహిమ ప్రజలందరికి కనబడెను.

✧ ✧ ✧

ఆది దేవుడెవరు ?

ఋగ్వేదము - 1:164:4

శ్లోకము : కో దదర్శ ప్రధమం జాయమాన
మస్తన్వన్తం యదనస్థా బిభర్తి ।
భూమ్యా అసురసృగాత్మా క్వస్విత్
కో విద్వాంసముప గాత్ ప్రష్టుమేతత్ ॥

భావము : మొదట (ఆది) పుట్టిన వానిని ఎవడు చూచినాడు ? భూమి మీద సృష్టి ఎప్పుడు కలిగినది ? ఎప్పుడు భూమి నుండి ప్రాణము, రక్తము పుట్టినవి ? ఆత్మలు ఎక్కడ నుండి ఉత్పన్నమయినవి ? ఈ విషయములు తెలుసుకొనుటకు ఎవడు విద్వాంసుని వద్దకు వెళ్ళును ? - డా॥ దాశరథి రంగాచార్య అనువాదం.

ఈ సృష్టికి మూలమెవరు ? ఆదికి పూర్వముండిన వారు ఎవరు? ఈ ప్రశ్నలకు బైబిలు జవాబు చూడండి.

బైబిలు : ఆదిసంభూతుడు యేసుక్రీస్తు (కొలొస్సి 1:15; సామె 8:22-31). నీవు నా కుమారుడవు నేడు నిన్ను కనియున్నాను (కీర్తన 2:7). మొదట పుట్టిన పురుషుడవు నీవేగా ? నీవు పర్వతములకు ముందుగా పుట్టినవాడవా ? (యోబు 15:7).

నాకు ముందుగా ఏ దేవుడును లేడు - నా తరువాత ఏ దేవుడు ఉండడు (యెషయా 43:10)

నేను యెహోవాను (స్వయంభవుడు) నేను తప్ప వేరొక రక్షకుడు లేడు (యెష 43:11).

లోకము పుట్టకముందున్నాను (యోహా 17:5).

అబ్రహాం పుట్టకమునుపే నేను ఉన్నాను (యోహా 8:57,58).

నేను మొదటివాడను కడపటివాడను (ప్రక 1:18).

✧ ✧ ✧

దేవుడు ఈ సృష్టికి కర్త

ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను - ఆది 1:1.
దేవుడు సృష్టిని చేసినపుడు చూచినవారెవరునూ లేరు.

ఋగ్వేదము - 10:129:6

శ్లోకము : "కో అద్ధా వేద క ఇహ్ప్ర వోచత్
కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః
అర్వాగ్దేవా అస్య విసర్జనేనా థా
కో వేదా యత అబభూవ"

భావము : ఈ సృష్టి ఎక్కడ నుండి వచ్చినది ? ఎక్కడ నుండి ఉత్పన్న మయినది? దేవతలు సృష్టికి తరువాత కలిగినవారు. కనుక ఈ సృష్టి ఎవరి వలన కలిగినది ? నిజముగ ఎవరికి తెలుసు ? ఈ సంగతులన్నియు ఎవరు మనకు వివరముగా చెప్పగలరు ?

ఋగ్వేదము - 10:129:7

శ్లోకము : "ఇయం విసృష్టిర్యత అబభవ
యది వా దధే యది వాన
యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్
త్సో అఙ్గవేద యది వాన వేద"

భావము : ఎవని వలన ఈ సృష్టి ఉత్పన్నమయినదో, ఆయన దీనిని రక్షించగలడు. లయము చేయగలడు. ఆయన అత్యున్నతమైన ఆకాశ సింహాసనము (పరలోకము) నుండి పాలిస్తున్నాడు. ఆయనకు సమస్తము తెలుసు. ఆయనకు తెలియని యెడల, తెలియజెప్పగలవాడు మరెవ్వడు ఉండడు.

బైబిలు గ్రంథమందు దేవుని సృష్టి

ఆది 1:1 - ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను.

యెష 45:18 - ఆకాశములకు సృష్టికర్తయగు యెహోవాయే దేవుడు; ఆయన భూమిని కలుగజేసి దాని సిద్ధపరచి స్థిరపరచెను. నిరాకారముగా ఉండునట్లు ఆయన దాని సృజించలేదు నివాస స్థలమగునట్లుగా దాని సృజించెను.

కీర్తన 33:6 - యెహోవా వాక్కుచేత ఆకాశములు కలిగెను ఆయన నోటి ఊపిరిచేత వాటి సర్వ సమూహము కలిగెను.

యోబు 26:7 - శూన్య మండలముపైన ఉత్తర దిక్కున ఉన్న ఆకాశ విశాలమును ఆయన పరచెను. శూన్యముపైని భూమిని వ్రేలాడ చేసెను.

(భూమి గుండ్రముగా ఉందనియు నిరాధారముగా శూన్యంలో వ్రేలాడుతుందని బైబిలు వేదం తెలియజేస్తుంది)

యోబు 38:4-7 - భూమికి పునాదులు వేసినప్పుడు నీవెక్కడ ఉంటివి ! నీకు వివేకమున్న యెడల చెప్పుము. దాని (భూమి) పరిమాణము చెప్పు, దాని కొలతవేసిన వాడెవడో చెప్పుము, దాని (భూమి) స్తంభముల పాదులు దేనితో కట్టబడెనో చెప్పుము. దేవ దూతలు అందరూ ఆనందించి జయధ్వనులు చేసినప్పుడు దానికి మూలరాయి (పునాది) వేసినవాడెవడు. సృష్టిని గూర్చి బైబిలు చెప్పినంత వివరముగా మరే గ్రంథములోను చెప్పబడలేదు.

"సహస్ర నామావళి"లో "క్రీస్తు"ను గూర్చి చెప్పబడినది

ఓం శ్రీ బ్రహ్మపుత్రాయ నమః

భావము : ఓ దేవా ! నిన్ను నీవు దేవుని కుమారునిగా బయలుపరచు కున్నందులకు నిన్ను స్తుతించుచున్నాను.

బైబిలు : యోహాను 20:31.

ఓం శ్రీ దరిద్రనారాయణ నమః

భావము : ఓ దేవా! ఏమిలేనివానిగ దరిద్రతను వస్త్రముగ ధరించుకొని బయలు పరచుకొన్నందుకు నిన్ను స్తుతించుచున్నాను.

బైబిలు : 2 కొరింథీ 8:9.

ఓం శ్రీ కన్య సుతాయ నమః

భావము : ఓ దేవా ! నీవు కన్య గర్భమున జన్మించినందులకు నిన్ను స్తుతించుచున్నాను.

బైబిలు : మత్తయి 1:22.

ఓం శ్రీ ఉమార్థాయ నమః

భావము : నీవు పరిశుద్ధాత్మ వలన అవతరించినందులకు నిన్ను స్తుతించుచున్నాను.

బైబిలు : మత్తయి 1:20.

ఓం శ్రీ విధిరిష్టాయ నమః

భావము : నీవు సున్నతి చేయబడినందులకు నీకు వందనములు.

బైబిలు : లూకా 2:21.

ఓం శ్రీ విరాచ్య శూల అరుదాయ నమః

భావము : ఓ దేవా ! నీవు ప్రాసుడై వ్రేలాడి (శూలమువలె) బలియైనందుకు నిన్ను స్తుతించుచున్నాను.

బైబిలు : 1 పేతురు 2:24; యెష 53వ అధ్యాయము.

ఓం శ్రీ పంచగాయ నమః

భావము : ఓ దేవా ! నీవు పంచగాయములు పొందినందులకు వందనములు.

బైబిలు : యోహాను 20:25-28.

ఓం శ్రీ క్రీమ్ ప్రూమ్కాయ నమః

భావము : ఓ దేవా ! నీవు మరణమును జయించినందులకు నీకు స్తుతులు.

బైబిలు : రోమా 1:6; ప్రకటన 1:18.

ఓం శ్రీ దక్షిణామూర్తి నమః

భావము : దేవా ! తండ్రి రొమ్మున నీవున్నందులకు నీకు వందనములు.

బైబిలు : మార్కు 16:19.

ఓం శ్రీ అజముగ నమః

భావము : దేవా ! నీవు గొర్రెపిల్లగా నున్నందులకు నిన్ను స్తుతించుచున్నాను.

బైబిలు : యోహాను 1:29.

యేసుక్రీస్తు సమస్త గ్రంథాలలో నుండి సర్వమానవాళికి తనను తాను ప్రత్యక్షపరచుకున్నారు (రోమా 16:25-27).

నమ్ము నమ్మకపో!

సూర్యుడు అగ్నికి పుట్టెను, అగ్నిదేవుడు సూర్యునకు పుట్టాడు. దక్షుడు అధిపతికి పుట్టాడు. అధిపతి దక్షునకు పుట్టింది. ఇంతకీ ఎవరు ఎవరికి పుట్టారో అర్థంకావడం కష్టం.

- సీత, నాగటి చాల్లో పుట్టింది.
- మత్స్యవల్లభుడు, చేపకడుపున పుట్టాడు.
- భీష్ముడు గంగ కడుపున పుట్టాడు.
- ద్రోణుడు కడవలో పుట్టాడు.
- శక, యవన, పౌండ్ర, పులింద, ద్రవిళ, సింహళ, శబరి, బర్బరులు అనబడినవారు వశిష్ఠుని హోమధేనువు తోకనుండి దాని మలమూత్రముల నుండి పుట్టారు.
- "రూప" యను కన్య బ్రహ్మ దేహము నుండి జన్మించింది.
- "దక్షుడు" బ్రహ్మదేవుని కుడిచేతి వ్రేలియందు పుట్టాడు.
- "ధరణి" బ్రహ్మదేవుని ఎడమచేతి వ్రేలియందు పుట్టాడు.
- "ఇక్ష్వాకుడు" మనువు తుమ్మగ ముక్కులో నుండి పుట్టాడు.
- "పులస్త్యుడు" బ్రహ్మదేవుని ఊహద్వారా పుట్టాడు.
- "వీరభద్రుడు" శివుడు తలవెంట్రుకలలో నుండి పుట్టెను.

ఋగ్వేదములోని పురుషసూక్తములో ...

- బ్రాహ్మణులు బ్రహ్మ యొక్క ముఖము నుండి పుట్టారు.
- క్షత్రియులు బ్రహ్మ యొక్క భుజముల నుండి పుట్టారు.
- వైశ్యులు బ్రహ్మ యొక్క తొడల నుండి పుట్టారు.
- శూద్రులు బ్రహ్మ యొక్క పాదముల నుండి పుట్టారు.

✧ ✧ ✧

బ్రహ్మ జననము :

- భాగవత పురాణములో : బ్రహ్మ విష్ణువు యొక్క నాభికమలము నుండి పుట్టెనని కలదు.
- నారాయణ పురాణములో : నారాయణుని యొక్క కుడిప్రక్క నుండి బ్రహ్మ జన్మించెనని గలదు.
- లింగ పురాణములో : శివుడే పరబ్రహ్మయని కలదు. మరియు శివుడు బ్రహ్మను, సరస్వతిని తన కుడివైపు నుండి పుట్టించెనని కలదు.
- మార్కండేయ పురాణములో : బ్రహ్మ మహాసరస్వతికి జన్మించాడని తెలియజేయబడుతుంది.
- రామాయణంలో : బ్రహ్మ పందిరూపము పొంది భూమిని సముద్రములో నుండి పైకెత్తినట్లు గలదు.
- శతపథ బ్రాహ్మణములో : (11:1–14) ఆదియందు జలము మాత్రమే ఉండెను. ఆ జలములకు కోరిక కలిగెను. అంతటాజలము ఘోర తపస్సు జేసెను. అందుకు ఫలితము ఒక బంగారు గ్రుడ్డు పెకిలేచెను.

ఆ గ్రుడ్డులో నుండి బ్రహ్మ జన్మించెను.

ఇందులో ఏది నిజమైన బ్రహ్మ జననం ?

విష్ణువు జననము :

- భాగవత పురాణములో : ఆదిశక్తి 3 గ్రుడ్లు పెట్టెననియు, వాటి నుండి త్రిమూర్తులు కలిగిరనియు తెలియుచున్నది.
- నారద పురాణములో : నారాయణ యొక్క ఎడమ ప్రక్క నుండి విష్ణువు పుట్టెనని గలదు.
- లింగ పురాణములో : శివుడు, విష్ణువును - లక్ష్మిని ఎడమవైపు నుండి పుట్టించెనని చెప్పుచున్నది.
- మార్కండేయ పురాణములో : విష్ణువు మహాలక్ష్మికి జన్మించెనని తెలుపుచున్నది. (లక్ష్మి విష్ణువు భార్య అన్నారు గదా !).

"నరకంలో హరిశ్చంద్రుడు"

రచయిత: శ్రీ నార్ల వెంకటేశ్వరరావు గారు.

త్రిమూర్తుల విషయమై కొన్ని సంగతులు నార్ల వెంకటేశ్వరరావు గారు వ్యక్తపరిచారు. మరియు వేమూరి శ్రీనివాసరావు గారు "శివపురాణం" నుండి కొన్ని విషయాలు వ్రాశారు చదవండి.

బ్రహ్మ : విష్ణుమూర్తియు, బ్రహ్మయు అధికారము కొరకు తగువులాడు కొనుచున్న సమయమున వారి ఎదుట దివ్య ప్రభలతో వెలుగొందుచు స్తంభమువలే లింగ మావిర్భవించెను. వారు దాని యవ్యవస్త్వమునకు వెరుగుపడి దాని ఆద్యంతములు పరీక్షింప గోరిరి. విష్ణుమూర్తి వరాహ రూపమున గ్రంధి వైపునకును, బ్రహ్మ

హంసరూపమున నూర్ధ్వమునకును వెళ్ళిరి. ఎవరు తుదివరకు పోయి వత్తురో వారికి రెండవ వారు పూజించునట్లు ఒడంబడిరి.

విష్ణుమూర్తి ఎంత వెళ్ళినను స్తభం యొక్క ఆది కనబడలేదు, అతడు తిరిగి వచ్చెను. బ్రహ్మ తను అంతమును చూచివచ్చితినని చెప్పెను. బ్రహ్మకు విష్ణువు నమస్కరించెను. అయితే శివుడు ప్రత్యక్షమై బ్రహ్మ అసత్యము పలికెనని చెప్పెను.

పై విషయము ఎంత అసభ్యమైనది, ఎంత అశ్లీలమయినది. దీన్ని అక్షరరూపంలో గాక శిల్పంగా మలచడం జరిగినది.

"పూర్వగాథలహరి" నందు చూడండి

(హమహయుని జననం)

విష్ణువు : రేవతుడనువాడు గుర్రమెక్కి వెళ్ళుచుండగా విష్ణువు లక్ష్మిని పిలిచి చూడుము ఆ గుర్రము ఎంత అందముగా ఉన్నదో అని చెప్పెను. లక్ష్మి ఆ గుర్రమును రెప్పవేయక చూచుచుండెను. అప్పుడు విష్ణువు నీకు గుర్రపురూపు మనసైనది కాబోలు నీవు ఆ గుర్రమై పుట్టుదువుగాక అని లక్ష్మిని విష్ణుమూర్తి శపించెను. ఆ శాపమునకు లక్ష్మి సంతాపం నొందెను. ఆ శాప విమోచన కొరకు శివుని ప్రార్థించుము, నీకు పుత్రుడు కలిగిన పిమ్మట శాపవిముక్తి కలుగునని విష్ణుమూర్తి పలికెను. అంతట లక్ష్మి కైలాసమునకేగి శివుని ప్రార్థించెను. శివుడు విష్ణువును రావించెను. విష్ణువు అశ్వరూపము (గుర్రము) తోడనే వెళ్ళి ఆ ఆడగుర్రాన్ని (లక్ష్మి) కూడెను. అది గర్భవతియై పుత్రుని బడసెను. వెంటనే లక్ష్మికి శాపవిమోచన కలిగెను. ఆ పుట్టిన బాలుని లక్ష్మి, విష్ణువు అచటనే దిగవిడిచి వెళ్ళిరి. ఆ పుత్రుడే హమహయుడు.

"పూర్వగాథలహరి" నందు జగన్మోహిని రూపము

శివుడు : విష్ణువు జగన్మోహిని రూపము ధరించి వచ్చుటచే దానవులు ఆమె రూపము చూచి మోహపరవశముచేత మైమరచి అమృతము కోల్పోయిరని శివుడు వినెను. ఆ రూపమెట్లుండునో చూడవలెనని అతనికి (శివుడు) కోరిక కలిగి తనకు చూపుమని విష్ణువును అడిగెను. నీ మతి చలించును, నీవు వికల మనస్కుడ వగుదువు, నీవు చూడజాలవని విష్ణువు చెప్పెను. గాని శివుడు బలవంత పెట్టెను. ఇతడెచటికేగునని శివుడు నాల్గు మూలలు పరికించుచుండగ ఇంతలో "మోహిని" శివుని యెదుట నిలిచెను. శివుని మతిచలించినది. ఆమెను పట్టుకొనుటకు ఆమె వెనుక పరుగిడెను. ఆమె వెంట శివుడు కామాంధుడై పరుగిడెను. నదులు, పర్వతములు, అరణ్యములు లెక్కచేయక ఆమె వెనుక పరుగిడెను. తుదకు శివునకు వీర్యము జారిపడెను. 'ఇదంతా హరిమాయ' విష్ణువు నిజస్వరూపము దాల్చి గోచరించెను.

రామాయణ, మహాభారతములలో కూడా ఇలాంటి వెన్నో ఉన్నాయి.

రామాయణంలో అహల్య ఇంద్రునితో వ్యభిచరించి "నా జన్మ పావనమైంది, మనకు ప్రమాదం రాకుండా నా భర్త తిరిగి రాకముందే మీరు చల్లగా తప్పుకొనండి" అని హెచ్చరిక చేసిన గాథలేదా ?

భారతంలో బూతు కథలు ఎన్నిలేవు ? కర్ణుని జన్మవృత్తాంతం జ్ఞాపకము చేసుకోండి? ఎవరికి ధర్మరాజును, భీముని, అర్జునుని కుంతి కనిందో జ్ఞాపకం తెచ్చుకొనండి ?

వీరు ఉత్తములని వాదించుటకు మరే గ్రంథమందయిన ఆధారము

లున్నాయా ? ఈ సంగతులు వ్రాసినవారు సభ్యతారహితులు, సంస్కార హీనులు, మలినమనస్కులు. వీటిని విశ్వసించినవారు వీరిని పోలినవారే.

వీరు చేసిన మరికొన్ని కార్యాలు చూడండి ... ...

"ఋజుదర్శిని"

రచయిత: పరవస్తు సూర్యనారాయణ గారు

నిజదైవమును గూర్చి సాక్ష్యమిచ్చుచూ ... దేవీ భాగవతమందు వ్రాయబడిన బ్రహ్మను గూర్చి తెలియజేస్తూ అతడు కాముకుడే గదా ! అన్నాడు. (ఋజుదర్శిని 22వ పేజి).

"కన్న కూతురును భార్యగ జేసుకొన్నట్టి
మాధవ సుతుడు కాముకుడు గాదే
తనివితీర అహల్యను గోరినట్టి - యఖవుడెన్నగ కాముకుడు గాదే
సురగురు సతితో మరుకేళి గూడిన
మరుకశ్యపుండు కాముకుడుగాదే - అంతదూరము పోనేల
యజ్ఞనాళగౌరి యుండగ గంగను నెత్తిన దాల్చి
కులుకుచుండెడి నీవు కాముకుడు గాదే"

భావము : మాధవుడు అనగా విష్ణుమూర్తి సుతుడు అనగా కుమారుడు బ్రహ్మ మాధవునకు కుమారుడు గనుక కుమారుడు. గనుక మాధవ సుతుడని పేరు కలిగెను. మాధవుని నాభినుండి కమలము పుట్టినది. ఆ కమలముపై బ్రహ్మపుట్టెను. కనుక మాధవసుతుడని పేరు వచ్చినది. బ్రహ్మ సృష్టిచేయాలని ఉద్దేశం కలవాడై ఒక నారిని సృష్టించి నాసికా రంధ్రములో ప్రాణవాయువు ఊదగా నారి ఆయెను. సృష్టించిన వెంటనే వస్త్రములీయబడలేదు. గనుక ఆమె నగ్న శరీర అంగముల భంగిమలకు ముగ్ధుడై పరవశముతో

ఆమెను కౌగలించుకొని భార్యగా జేసికొనెను.

సృష్టించినవాడు సృష్టికర్త గదా ! సృష్టింపబడిన "నారి" కన్న కూతురుగదా ! అట్టి కన్న కూతుర్ని భార్యగ జేసుకొన్నట్టి యీ మాధవసుతుడు (బ్రహ్మ) కాముకుడు గాక దేవుడెట్లగును ?

విష్ణుమూర్తి తులసీదేవితో క్రీడించుట

అసాధారణ రూపవతియగు తులసీదేవితో భోగింప ఇచ్ఛగల విష్ణువు శంకుచూర రూపంబుతో నగరికేగి పౌరులచే సన్మానములు బొంది! అంతః పురం జేరెను. తులసీదేవి యుద్ధవార్తలడుగగా నేను, శివుడు చిరకాలము ఒకరినొకరు తీసిపోక యుద్ధము చేసితిమనియు, బ్రహ్మదేవుడు వచ్చి స్వర్గము నింద్రున కిచ్చునట్లు, నేను నా రాజ్యము నేలునట్లును సంధి చేసెననియు చెప్పగ తులసీదేవి సంతసించి అతనిని కౌగలించుకొనెను. తులసీదేవికి మాటలలో, చూపులలో, సురతక్రీడలలో తన భర్తకును ఇతనికిని భేదము గోచరింపగా అతడు పరపురుషుడని యెరిగి ఓరి ! నీవెవ్వడవు, నిజము చెప్పుము లేనిచో శపింతుననెను. అంత విష్ణువు నిజ స్వరూపమును చూచి అసహ్యించుకొని, విచారించి, తనని మోసగించి చెరచిన విష్ణువుతో ఇట్లనెను. నీకు పాపమును పుణ్యమును తెలియదా ? నా శీలమును నట్టేటముంచితివి. ఓ దుష్టుడా నీవు మొండిశిల వగుదువని శపించి తన భర్త మరణించుట తెలిసి మిక్కిలి దుఃఖించెను.

(ఈ విధంగా రచయితలు ఎందుకు వ్రాశారో ! వీటి యొక్క మూలాధారములు వేరై ఉండును).

పద్మపురాణం 6వ అధ్యాయంలో ...

సముచి మొదలగు పూర్వదేవతలు భక్తిపరులు. వారిని చంప వలెనన్న మొదట వారి భార్యల పాతివ్రత్యమును పాడుచేయవలసి

యున్నది. గాన విష్ణువు బుద్ధరూపమున వారి యొద్దకు వెళ్ళె !

తే.గీ. : "అన్యగామినియైన దొంగలదియైన లెస్స
జిహ్వ కింపైన దాని భుజింపవలయు
కంటికింపైన కాంతల గవియవలయు
బ్రతుకు దినముల మోక్షంబెతుకనేల"

అని బోధించి స్త్రీల పాతివ్రత్యమును చెరిపెనని వ్రాయబడెను. (దీని మూలాధారం వేరై ఉండవచ్చును).

"స్కాంద పురాణం" లోని రుద్రకోటి మహాత్మ్యము 7వ అధ్యాయం.

శ్లోకము : తతో విష్ణు సమాగత్య ప్రణమ్య ముని పుంగవమ్
ప్రమాదో ద్రోహ మారబ్ధం క్షమ యేత్యర్థి యాచితః

అని ప్రారంభించెను.

దీని భావమేమనగా ... అంతట విష్ణువు వచ్చి మునిపుంగవుడగు భృగుమహర్షికి నమస్కరించి నేను ప్రమాద వశమున చేసిన ద్రోహమునకు క్షమాపణ నిమిత్తమై మిమ్ము యాచించితినని చెప్పెను. నేను ఘోర పాపమును చేసితిని.

(ఈ శ్లోకమునకు మూలము మరొకటై యుండవచ్చును)

రాముడికి సీత ఏమౌతుంది ?

వైదిక వాఙ్మయములో రాముడు అనే పేరు 4 సార్లు కనిపిస్తుంది.

1. ఋగ్వేదం 10వ మండలంలో రాముడు ఉన్నాడు. ఈయన మాయవ వంశమువాడు.

2. శతపథ బ్రాహ్మణములో ఒక ఆచార్యుని పేరు రాముడు. ఇతడు ఉపతపస్వి వంశం వాడు.

3. జైమినీయ ఉపనిషత్తు బ్రాహ్మణంలో ఒక రాముడు క్రాతు జాతీయుడు.

4. ఐతరీయ బ్రాహ్మణంలో రాముని గూర్చి ఒక రాజ మార్గవేయుడి ప్రసక్తి ఉంది. ఇతడు శ్యాపర్ణుల పురోహితుడు. ఈ రాములలో ఏ ఒక్కరు ఇక్ష్వాకుల వంశంవారు లేరు. ఈ వంశం ఋగ్వేదకాలంలో చెప్పుకోదగ్గ వంశమే.

ఈ వైదిక రాములకు సీతతో కూడా ఎలాంటి సంబంధం లేదు.

1. ఋగ్వేదంలో సీత రాముడి భార్యకాదు; ఇంద్రుని భార్య.
2. తైత్తరీయ బ్రాహ్మణము (2:3:10) ప్రకారం సీత చంద్రుని భార్య.
3. బౌద్ధ రామాయణంలో రాముడికి సీత చెల్లెలు.
4. భోటాన్ రామాయణంలో రామ, లక్ష్మణుల భార్య.

రామాయణ మంత విన్నాక "రాముడికి సీత ఏమౌతుంది" అనే సామెత వింటున్నాం కదా !

మన దేశంలోనే కాదు ఆయా దేశాలలో రామాయణాలున్నాయి. ఆ వివరాలు కావలసినవారు డాక్టర్ ఆరుద్ర (మద్రాస్) గారు వ్రాసిన "రాముడికి సీత ఏమౌతుంది" అనే పుస్తకంలో అనేక వివరములు ఉన్నాయి, చదువుకోండి.

"శ్రీకృష్ణ లీలలు" అంటే ఏమిటి ?

శ్రీకృష్ణుని గూర్చి పండిట్ సి.హెచ్. ఫ్రాన్సిస్ గారు ఈ క్రింది విషయాలను వేద ఆధారాలతో వాఙ్మయ రూపముగ తెలియజేసెను, వినండి.

శ్రీకృష్ణుడు - క్రీస్తు అను గ్రంథం)

ద్వారకా నగరమందు శ్రీకృష్ణుడు చేసిన పనులను ...

శ్రీ మదాంధ్ర భాగవతము దశమస్కంధములో వ్రాయబడెను

గోపికలు యశోధాదేవి యొద్దకు వచ్చి ఇట్లు మొఱపెట్టిరి.

అమ్మా ! కృష్ణుడు మా ఇల్లు సొచ్చి నేయి త్రాగి తుదకు ఆ కడవలను వీరింట నుంచగా వారికి, మాకు పెద్ద కలహం వచ్చెను. (813 ప) తన చేబంతి (బంతి) తప్పిపడిందని వచ్చి మా అమ్మాయి ఇంటి వెనుక స్నానము చేయు చుండగ నీ కొడుకు దాని కోకను (చీరను) తీసుకొనిపోయెను ఇది తగునా? (817 ప) ఒక స్త్రీ తనకు కొడుకులు లేరని చింతించుచుండగ తన్ను మగనిగ గాకొనిన కొడుకులు కలిగిదరని దానిపై కృష్ణుడు పడెను (810 ప) ఒక యువతి నిద్రించుచుండగ దాని కోక లాగి పెద్దతేలు కరిపించగ ఆమె లేచి భయముతో చూచినంతలో కృష్ణుడు పరుగెత్తెను ఇది ధర్మమా? (826 ప) నా కొడుకు, కోడలు (రహస్యము) పెనుగులాడు చుండగ నీ కొడుకు పామును తెచ్చి వారిపై వేసినంతనే వారు వస్త్రములు విడిచి పారిపోగా కృష్ణుడు చూచి నవ్వెను ఇది మంచి గుణమా? (326 ప) గోపికలు తమ కోకలు దూరముగా పెట్టి జలకమాడుచుండగా వారి కోకలు దొంగిలించి పొన్న చెట్టుపై కూర్చుండెను.

పై వారందరూ మానవులేయని వారి గుణములను బట్టి అర్థమౌతుంది.

"విధిరాత"ను తప్పించుకోలేని దేవుళ్ళు

రాముడు, కృష్ణుడు, విష్ణువు, బ్రహ్మ, శివుడు అను వీరి వెనుక ఒక దైవముందని ఆ దైవమే "విధి" అని దాన్ని ఎవరూ తప్పించుకోలేరనియు 'వేమన యోగి' అంటున్నాడు.

వేమన పద్య రత్నాకరము

రచయిత: శ్రీ భాగయ్య సిద్ధయ్య

పద్యం : మెలత నడవి నుంచి మృగవెంటనె
పోయె; రామచంద్రుని కన్న రసికుడేడి ?
చేటుకాలమునకు చెడుబుద్ధి పుట్టును
విశ్వదాభిరామ వినురవేమ !

భావము : విధి బలీయమైనది అనడానికి రాముడి జీవితాన్ని ఉదాహరణగా చెప్పాడు. బంగారం వంటి భార్య (సీత)ను నట్టడవిలో వదిలి ఒక మాయలేడి వెంట పరుగులు తీసాడు అవతారమూర్తియైన శ్రీరాముడు. (వేమన పద్యరత్నాకరం 22వ పేజి)

పద్యం : కనక మృగము భువిని కలగదం చెరగదా
రాముదెరుక గల్గు రాజుకాడో ?
చేటుకాలమునకు చెడుబుద్ధి పుట్టును
విశ్వదాభిరామ వినురవేమ !

భావము : భూమిమీద బంగారులేడి ఉండదనే విషయం విజ్ఞుడయిన శ్రీరాముడికి తెలియదా ఏమి ? "కష్టకాలము వచ్చింది" (విధిరాత) కనుక చెడుబుద్ధి పుట్టింది.

పద్యం : పడతి మోపె నొకడు, పడతి మేపె నొకడు
పడతి నరము జేర్చి బ్రతికెనొకడు
పడతి కొరకె పెక్కు పాట్లనుబడిరయా
విశ్వదాభిరామ వినురవేమ !

భావము : బ్రహ్మ సరస్వతిని వాక్ స్థానంలో ఉంచాడు, విష్ణువు లక్ష్మిని గుండెల మీద నిలిపాడు (ఎక్కించుకున్నాడు) వీరిద్దరికంటే శంకరుడు మిన్న పార్వతిని తనలో సంగం చేసింది చాలదన్నట్లు ఇంకొక స్త్రీ (గంగ)ని ఏకంగా నెత్తి నెక్కించుకున్నాడు. త్రిమూర్తు లంతటివారే స్త్రీల కోసం ఇన్ని అగచాట్లు పడితే మామూలు నరుల సంగతిక చెప్పనేల ?

బ్రహ్మదేవుడు తన కూతురు వాగ్దేవిని మోహించాడు. (కన్న కూతుర్ని భార్యగ జేనుకున్న మాధవనుతుడు (బ్రహ్మ) కాముకుడు).

ఈ క్రింది పద్యం వినండి ...

పద్యం : ఆడుదాని చూడ నర్థంబు చూడగ
బ్రహ్మకైన పుట్టు రిమ్మ తెగులు
బ్రహ్మ యాలి త్రాడు బండరేవున త్రెంచ
విశ్వదాభిరామ వినురవేమ !

భావము : కాంతను, కనకమును చూస్తే బ్రహ్మకైన మదన వికారం పుడుతుంది ! దేవుడయితేనేం ? అతడి పెళ్ళాం తాడు రేవు గట్టున త్రెంచ ! వేమన బ్రహ్మను ఇలా తిట్టడానికి కారణం పురాణకాల ప్రకారం "బ్రహ్మ" తన కూతురు "వాగ్దేవి"ని మోహించాడు.

స్త్రీల వల్ల దేవుళ్ళకు జరిగిన అనర్థాలు

(వేమన పద్యరత్నాకరం 92, 93 పేజీలు)

పద్యము : కైకపుట్టి చెరచెగా రాము పట్టంబు
సీత పుట్టి లంక చెరిచెదాగె ?
కౌరవులను చెరిచెగద ద్రౌపతియు గూడ
విశ్వదాభిరామ వినురవేమ !

భావము : రామాయణ భారతాలు తిరగేస్తే స్త్రీల వల్ల జరిగిన అనర్థాలకు కావలసినన్ని ఉదాహరణలు.

రాముడి పట్టాభిషేకానికి కైక అడ్డుపడింది, లంకా పట్టణ నాశనానికి సీత కారకురాలయింది, కౌరవులపై ముట్టడికి ద్రౌపతి తోడ్పడింది ! ఇంకేమి చెప్పగలం ? స్త్రీల వల్ల చెడనిదెవరు ?

స్త్రీల వల్ల త్రిమూర్తులకే అవమానములు తప్పలేదు.

పద్యము : బోటి యొకతె బ్రహ్మ నోటి మీదనె తన్నె
కొమ్మ యొకతె విష్ణు రొమ్ము తన్నె
నకియ యొకతె శివుని నగముగా చేసెను
విశ్వదాభిరామ వినురవేమ !

భావము : బ్రహ్మ భార్య సరస్వతి భర్త నోటిమీద తన్నగా, లక్ష్మీదేవి భర్త వక్షము మీద తన్నింది. పార్వతి ఇంకా ఘనురాలు శివుడ్ని సగం చేసింది. ఇక నరులనగా ఎంత ?

దేవుళ్ళే సంసార సాగరాన్ని ఈదలేకపోయారు

పద్యము : మునిజనములు కలుగ మునిగి వెళ్ళిన బావి
బ్రహ్మకు తలనెత్తరాని బావి
మొలబంటిగాను ముంచు నెవ్వరినైన
విశ్వదాభిరామ వినురవేమ !

భావము : నరులేకాదు ! మహా మునీశ్వరులు సైతం ఈ సంసారం అనే బావిలో పడ్డారు. అంతెందుకు ? సాక్షాత్తు బ్రహ్మదేవుడే మహా సంసారి. ఇది మొలబంటిగా ఉన్నట్టే కన్పిస్తుంది, గానీ తీరా దిగితే ముంచేయగల గొప్ప బావి.

పద్యము : బంధుకోటి బాసి, బయలును దెలియక
సింధు పుత్రి మాయజిక్కె కాదె ?
శారంగి అంతవాడె ! జనులకు శక్యమా ?
విశ్వదాభిరామ వినురవేమ !

భావము : తన వాళ్ళనందరినీ వదలిపెట్టి పెళ్ళాం మీద మోహం చేతనే ఆ లక్ష్మి మాయలో చిక్కి సాక్షాత్తు విష్ణువే అత్తవారింట (పాల సముద్రంలో) ఉండిపోగాలేనిది, మామూలు మానవులు ఒకలెక్కా భార్యకు లొంగని వారేరి ?

పద్యము : కాళ్ళ ముందటేరు కడకీదగా లేక
ముగ్గురీత గాండ్రు మునిగినారు, నరుడు
ఈదునన్న నగుబాటు కాదొకో ?
విశ్వదాభిరామ వినురవేమ !

భావము : సంసారం అనే ఈ మహాప్రవాహం దాటలేక గజీతగాళ్ళతో

పోల్చదగ్గ త్రిమూర్తులే మునిగిపోయారు. సామాన్య మానవులు ఒక లెక్కా ? దాటగలుగుతాడనుకోవడం నవ్వుల పాలేకదా !

బ్రహ్మ, ఇంద్రుడు, మన్మథుడు అందరూ కామానికి బలయి పోయినవారే !

పద్యము : ఇంద్రుడాయె కామి, హీనుడైపోయెను
మారుడాయె కామి, మడిసి పోయె
బ్రహ్మయయ్యె కామి, బైసిపోవాడెను
విశ్వదాభిరామ వినురవేమ !

భావము : ఇంద్రుడు కామం చేతేకదా అవమానం పాలయ్యాడు. మన్మథుడు కామం వల్ల ఏకంగా కాలి బూడిదయ్యాడు. బ్రహ్మవంటి వాడే కామంచేత తలదించుకోవలసిన స్థితికి గురయ్యాడు.

క్రీ॥శ॥ 17-18 శతాబ్దాల మధ్య జీవించిన వేమన యోగి ఎన్నో విషయాలు తన పద్యాల ద్వారా సమాజానికి అందించాడు. ఈయన వ్రాసిన పద్యాలు ఎవరూ కాదనలేరు. ఇన్ని విషయాలు వ్రాసి వేమన యోగి క్రీస్తును గూర్చి గాని ఆయన దైవత్వమును గూర్చి గాని ఎక్కడా ఏమి చెప్పలేదు.

(ఈ పద్యాలన్ని వేమన దృక్పధంలో మరొక విధంగా ఉండునని నా అభిప్రాయం).

◆ ◆ ◆

బైబిలు గ్రంథము మతమార్పిడిని ఖండిస్తుంది

యేసుప్రభువు ఏమన్నారో చూడండి ...

- అయ్యో ! వేషధారులైన శాస్త్రులారా !! పరిసయ్యులారా !!! ఒకని మీ మతములో కలుపుకొనుటకు మీరు సముద్రమును, భూమిని చుట్టి వచ్చెదరు. అతడు కలిసినప్పుడు, అతని మీకంటే రెండంతలు నరక పాత్రునిగా చేయుదురు (మత్త 23:15).

  యేసుప్రభువు మత మార్పిడి చెందమనలేదు. గాని మతి (మనస్సు) మార్పిడి చెందమన్నారు.

- అప్పటి నుండి యేసు – పరలోక రాజ్యము సమీపించియున్నది. గనుక మారుమనసు పొందుడని చెప్పుచు ప్రకటింప మొదలుపెట్టెను (మత్తయి 4:17).

- క్రైస్తవ మతములో నున్న వారందరూ మోక్షానికి వెళతారని బైబిలు చెప్పుటలేదు (మత్త 7:21-27).

- బైబిలు గ్రంథము మోక్షానికి మార్గము చూపిస్తుంది (యిర్మియా 6:16; మత్తయి 7:13, 14).

- యేసుక్రీస్తు యూదా జాతిలో జన్మించినను, వారి మతాచారములు పాటించలేదు; ఆ మతములో చేరమని ఎప్పుడూ చెప్పలేదు (మత్తయి 15:1-14).

- బైబిలు గ్రంథము మత సంబంధమయిన పక్షపాతముతో చూడదు, అందరిని సమదృష్టితో చూస్తుంది (రోమా 3:9-18).

భూలోకమందున్న ప్రజలందరూ పాపాన్ని విడిచిపెట్టి నీతిమంతులుగా జీవించాలని చెప్పుతున్నది (యెహెజ్కేలు 33:11-16; మీకా 6:8).

దేవుడు మానవుని యొద్ద నుండి ఆశించేది మతము కాదు గాని, మానసిక పరివర్తన. అదేమనగా : మత్తయి 22:35-40 చదవండి.

తమ మతమే గొప్పదని గర్వించే వారిని సిగ్గుపరచుటకై యేసు ప్రభువు ఉపమానం చెప్పారు (లూకా 10:30-37).

యూదులు తమ మతమే గొప్పదని భ్రమపడతారు.

యేసుప్రభువు యూదుల కంటే ఇతర మతాలలో నున్న విశ్వాసపు విలువను కొనియాడినారు. (మత్తయి 15:21-28; 8:5-10).

సర్వ మతాలు మంచినే ఆశించాలి.

✧ ✧ ✧

యేసుక్రీస్తు మోక్ష ప్రధాయకుడు

ఇంత వరకు అనేక విషయములు ధ్యానించితిమి గదా ! క్రీస్తు యొక్క మహాత్యము మరియు పాపులను రక్షించుటకు సమర్ధుడని తెలియ జేసితిని.

యేసుక్రీస్తును గూర్చి, ఆయన దైవత్వమును కొంత యోచించుదాం.

1. **క్రీస్తు దేవుడు :** కీర్తన 45:6; యెష 9:6; యోహా 1:1; రోమా 9:5; **తీతు** 2:13; 1 యోహాను 5:20; యోహా 20:28; హెబ్రీ 1:8; కొలస్సీ 2:9.

2. **క్రీస్తు శాశ్వతుడు :** ఆది 1:1 – సృష్టికి ముందే ఉన్నాడు.
ఆది 21:33; యెష 40:28; రోమా 16:26.

బైబిల్లో మానవ చరిత్ర చూద్దాం. ఆదాము (మొదట పుట్టినవాడు) నుండి క్రీస్తు వరకు దాదాపు 4000 సంవత్సరాలు గతించాయి. యేసుక్రీస్తు పుట్టిన తరువాత 2000 సంవత్సరాలు గడిచాయి. క్రీస్తు రాజుగా పరిపాలన 1000 యేండ్లు వెరసి మానవ చరిత్ర కనీసం 7 వేల సంవత్సరములు ఉంది. ఇది చాలా దీర్ఘకాలం. కీర్తన 9:7; 10:16; 90:2; 93:2; 146:10.

3. **క్రీస్తు కరుణాసంపన్నుడు :** ఎఫెస్సి 2:4; 2కొరింథీ 1:3; 1పేతు1:3.
4. **క్రీస్తు దక్షిణామూర్తి :** కీర్తన 145:8; 1 పేతురు 5:10.
5. **క్రీస్తు దయాళుడు, ఉత్తముడు :** కీర్తన 25:8; 100:5.
6. **క్రీస్తు అనుగ్రహం చూపేవాడు :** రోమా 2:4; 11:22.
7. **క్రీస్తు సర్వాధిపతి :** 1 దినవృ. 29:11; 2 దినవృ 20:6; యెష. 14:24; యిర్మి 10:10. దయతో చదువగలరు.

లింగపురాణం, పూర్వభాగము 71వ అధ్యాయంలో ...

శ్లోకము : అనాదిత్వా చ్చ పూర్వ త్వాత్స్వయ స్వయంభూరితి సకస్మృతః

"అద్యంతము లేనివాడు, పూర్వమందుండిన వాడు, స్వయంభవు డయినవానినే స్మరించుము."

1. క్రీస్తు స్వయంభవుడు : యోహాను 1:4; ప్రకటన 1:8; యోహా 5:26. "ఆదియంతట తాను ఉండువాడు" యెష 44:6; యిర్మి 23:6.

2. క్రీస్తు అదృశ్యదేవుని స్వరూపం :

3. క్రీస్తు నిత్యుడు : యోహా 1:1-3; 8:5; హెబ్రీ 13:8; 1 యోహా 5:20.

4. క్రీస్తు పరిశుద్ధుడు : లూకా 1:35; యోహా 6:39; హెబ్రీ 7:26; అ.కా. 3:14.

5. క్రీస్తు పాపహరుడు : మత్త 20:28; మార్కు 10:45; ఎఫెసి 1:7; అ.కా. 13:39; ఎఫెసి 5:2; 1 తిమో 2:5,6; తీతు 2:14; యెష 44:6.

6. క్రీస్తు మోక్షప్రదాత : ప్రక 2:10; మత్త 10:22; 19:28,29; యోహా 10:27,28; యాకో 1:12.

7. క్రీస్తు శాంతిదాత : 1 యోహా 4:10; 1 యోహా 2:1-2.

కావున ప్రియ సోదరులారా ! మీరు మోక్షప్రధాయకుడైన క్రీస్తుని నమ్మి ఆయన యందు భక్తిని నిలుపండి.

వేదాల్లలో యజ్ఞపశువును గూర్చి వ్రాయబడింది	బైబిలు నందు యేసుక్రీస్తు అను బలిపశువును గూర్చి వ్రాయబడింది
1. మచ్చలేని మేకపిల్ల కావలెను. నిర్దోషమైనది అని దీని అర్థము) ... ఋగ్వేదం - బృహదారణ్యకోపనిషత్ 1:4:1	1. యేసుక్రీస్తు (దేవుని గొర్రెపిల్ల) పాపములేని దైవ మానవుడు. పాపమెరుగనివాడు ... 2 కొరి 5:21 యేసు పాపముచేయలేదు ... 1 పేతు 2:22 ఆయనయందు పాపములేదు ... 1 యోహా 3:5 సమస్త విషయములలో ... పాపము లేనివాడుగా ఉండెను ... హెబ్రీ 4:15; నిర్గమ 12:6
2. దాని (మేకపిల్ల) తలకు బలుసుకంప ముల్లు చుట్టవలెను. ... యజుర్వేదం - శతపదబ్రాహ్మణము 7:3:1	2. ముండ్ల కిరీటమును అల్లి ఆయన తలకు పెట్టిరి ... మత్త 27:29; ఆది 3:18
3. దానిని (తుమ్మకర్ర) యూపస్తంభము నకు కట్టవలెను. ... ఋగ్వేదం - బృహదారణ్యకోపనిషత్ 90:7.15 యజుర్వేదము 9:28	3. యేసును సిలువ అను మ్రానుపై నంటగొట్టిరి. ... మత్త 27:35; కీర్త 118:27
4. దాని నాలుగు కాళ్ళలోను రక్తము కారునట్లు కొట్టవలెను. ... సామవేదం - తాండియ మహాబ్రాహ్మణం 4:10	4. వారు ఆయన చేతులు, పాదములు మేకులతో కొట్టిరి. ... మత్త 27:30-35

వేదాల్లో యజ్ఞపశువును గూర్చి వ్రాయబడింది	బైబిలు నందు యేసుక్రీస్తు అను బలిపశువును గూర్చి వ్రాయబడింది
5. మేకకు కప్పిన కప్పడములను నలుగురు ఋత్వికులు పంచుకొనవలెను. ... ఋగ్వేదం - ఐతరేయ బ్రాహ్మణము	5. యేసును సిలువవేసిన తరువాత ఆయనపై వస్త్రమును చింపక నలుగురు సైనికులు చీట్లువేసిరి ... యోహా 19:23,24; కీర్త 22:1
6. దాని ఎముకలలో ఒకటియును విరువకూడదు. ... ఋగ్వేదం - ఐతరేయ బ్రాహ్మణము 2:6	6. వారు ఆయన కాళ్ళు విరుగగొట్టలేదు "అతని ఎముకలలో ఒకటియు విరువబడదు" ... యోహాను 19:33-36; నిర్గ 12:46; సంఖ్య 9:12
7. మేకకు సోమరసము త్రాగించవలెను. ... యజుర్వేదము 10:10.1	7. బోళము కలిపిన ద్రాక్షరసము ఆయనకిచ్చిరి. ... మార్కు 15:23; కీర్త 69:21
8. దాన్ని వధించిన పిమ్మట ప్రాణ ప్రతిష్ఠ చేయవలెను. ... శతపథ బ్రాహ్మణము 7:1:2 - బృహదారణ్యకోపనిషత్ 3.9.28:4,5	8. సిలువ వేయబడిన నజరేయుడగు యేసును మీరు వెదుకుచున్నారు. ఆయన లేచియున్నాడు. ఇక్కడలేడు ... మార్కు 16:6
9. దాని మాంసము భుజించవలెను. ... ఋగ్వేదము - శతపథబ్రాహ్మణము 5:1. 1-1-2 - భగవద్గీత 4 అధ్యా. 31 శ్లోకం	9. యేసు రొట్టెను విరిచి ఇది మీ కొరకు నా శరీరము ... ఇది నా రక్తము నన్ను జ్ఞాపకం చేసుకొనుటకు దీనిని చేయుడి. ... మత్త 26:26-28; లూకా 22:19 నా శరీరం తిని నా రక్తం త్రాగువాడు నిత్యజీవము గలవాడగును.

యేసుక్రీస్తు - దేవుడు కాడా ?

ఆ మధ్య ఒకానొక పట్టణంలో కొంతమంది క్రైస్తవ యువకులు యేసుక్రీస్తు ప్రభువు యొక్క రెండవ రాకడను గూర్చి ఆ పట్టణంలో నున్న వారికందరికీ తెలియజేయాలనే సదుద్దేశ్యంతో పట్టణంలోని ముఖ్యమైన కూడలి స్థానాల్లో గోడలమీద **"Jesus is Coming Soon"** (యేసు త్వరగా వచ్చుచున్నాడు) అని వ్రాశారు. ఆ పట్టణంలో వున్న క్రీస్తు భక్తులు, భక్తురాండ్రు ఆ మాటలు చూచి చాల సంతోషించారు. ప్రభువు యొక్క రెండవ రాకడను గూర్చి పట్టణ ప్రజలందరికీ తెలియజేయడం చాలా సంతోషకరమైన విషయం అని ఆ మాటలు వ్రాసిన వారిని మనసులోనే అభినందించారు. సత్యాన్వేషకులైన మరికొందరు యేసుక్రీస్తు మరలా రావడమేమిటి అని దీర్ఘాలోచనలో పడిపోయారు.

అయితే ఓ మూడు నాలుగు రోజుల తరువాత పట్టణం మేల్కొని చూచేసరికి ఆ గోడలన్నిటి మీద మరో నినాదం వెలిసింది. **"Jesus is Coming Soon"** (యేసు త్వరగా వచ్చుచున్నాడు) అని వ్రాయబడిన ప్రతిచోట దాని క్రింద **"Crucify Him Again"** (ఆయన్ని మరలా సిలువవెయ్యండి) అనే మాటలు పెద్ద పెద్ద అక్షరాల్లో కొట్టొచ్చినట్లు కనబడ్డాయి. ఆ మాటలు ఎవరు వ్రాశారో తెలియదు గాని ఈ మన విశాల భారతావనిలో ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాలలో ఒకటిగా ఎంచబడుతున్న మన దేశంలోని కొందరు మతఛాందసుల హృదయాల్లో క్రీస్తుకూ, క్రీస్తు భక్తులకూ వ్యతిరేకంగా గూడు కట్టుకొని ఉన్న దురభిమానానికీ, ద్వేషభావానికీ ప్రత్యక్ష నిదర్శనాలు అవి.

"ఆయన్ని మరలా సిలువవెయ్యండి" అని వ్రాసిన వారికి అసలు

ఆయన రెండవసారి ఎందుకొస్తున్నాడో తెలియదు కదా ! దాదాపు రెండు వేల సంవత్సరాల క్రితం జగద్రక్షకుడైన యేసుక్రీస్తు ప్రభువు తన పరలోక మహిమను సైతం ప్రక్కనబెట్టి, తనను తాను రిక్తునిగా చేసికొని మానవ స్వరూపం దాల్చి బహుధీనునిగా ఈ భూగోళం మీద అవతరించాడు. తాను దేవుడైవుండియు, పాపము చేత పీడించబడుచున్న మానవ జాతిని రక్షించు నిమిత్తము జన్మపాపము అంటని అతి పరిశుద్ధునిగా కన్య మరియ గర్భమున జన్మించాడు. కర్మపాపము అంటని అతి పవిత్రునిగా ఈ లోకంలో జీవించాడు. తన మాటల ద్వారా, చేసిన అద్భుతముల ద్వారా తన దైవత్వాన్ని సర్వప్రపంచానికే ఎంతో తేటగా ప్రత్యక్షపర్చాడు. సర్వమానవ పాప పరిహారార్థమై సిలువలో తనను తాను బలియాగంగా సమర్పించు కున్నాడు. పాపమును, పాపశాపమైన మరణమును జయించి సజీవునిగా తిరిగిలేచి పరలోకానికి ఎక్కి వెళ్ళాడు. ఇది చరిత్ర ఎలుగెత్తి ప్రకటించు చున్న సజీవ సత్యం.

కాని, ఈ సారి యేసు వచ్చినప్పుడు కన్య మరియ వుండదు, బెత్లేహేము పాక వుండదు, పశువుల తొట్టి వుండదు, సిలువ కట్టె వుండదు "యేసు సిలువ" ప్రపంచ చరిత్రలో ఒకేసారి జరిగే సంభవం. ఈసారి ఆయన సర్వ ప్రపంచానికీ న్యాయం తీర్చే ప్రపంచ న్యాయాధిపతిగా, యూదాగోత్రపు కొదమ సింహముగా దిగి రాబోతున్నాడు. 'ఆయన్ని మరలా సిలువ వెయ్యండి' అని గోడలమీద వ్రాస్తున్న వారిని, 'ఈ క్రీస్తు మాకొద్దు' అని అంతరంగంలో కేకలు వేస్తున్న వారిని చూచి "మీ కొరకక్కూడా నేను సిలువలో మరణించాను. నా సిలువకు మీరిచ్చిన జవాబు ఏమిటి? మీ కొరకక్కూడా నా రక్తం ధారపోశాను, నా ప్రేమకు మీరిచ్చిన బదులేమిటి?" అని ఆయన ఘర్జించినపుడు వీరంతా ఎలా తట్టుకోగలుగుతారు? ఎలా

నిలబడగలుగుతారు ? అయ్యో అది ఎంత భయంకరమైన దృశ్యమో కదా!

ఇంతకూ వీరు క్రీస్తునూ, క్రీస్తు భక్తులనూ ద్వేషించడానికి అసలు ఈ క్రైస్తవులు ఏం తప్పుచేశారని ? అందరిలాగే వీరూ ఈ దేశంలో పుట్టారు దేశనాయకుల కొరకు, ప్రభుత్వాధికారుల కొరకు, ప్రజల కొరకు అను నిత్యం ప్రార్థిస్తున్నారు. విద్యా, వైద్య, సామాజిక రంగాల్లో దేశానికి ఎనలేని సేవలు చేస్తున్నారు. ప్రభుత్వ చట్టాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ ఆదర్శపౌరులుగా మెలుగుతున్నారు. కులమత భేధాలు వీరికి లేవు. క్రైస్తవులలో అన్ని కులాల వారూ ఉన్నారు. వాదాలు, తగాదాలు వీరికి అసలే పనికిరావు. "నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించు" అనే యేసు ఆజ్ఞకు లోబడి బాధితులకు, పీడితులకు, రోగులకు, నిర్భాగ్యులకు చేతనైనంత సాయం చేస్తూ భారత జనస్రవంతిలో భాగంగా దేశానికే వన్నెతెస్తున్న క్రైస్తవుల మీద ఎవరికైన కోపం, ద్వేషం ఎందుకు ? సౌమ్యులుగా, శాంతి కాముకులుగా, సమాధాన ప్రియులుగా అందరితో కలిసిమెలిసి సహజీవనం చేస్తూ సౌభ్రాతృత్వ సౌరభాన్ని నలుదిశలా వెదజల్లే వీరిమీద, వీరి ఆరాధ్య దైవమైన క్రీస్తుమీద ఎవరికైనా ద్వేషం ఎందుకు ?

యేసుక్రీస్తు ప్రభువు సార్వజనీక ప్రేమను బోధించాడు. మానవ జాతికి శాంతి సహజీవన విధానాన్ని నేర్పించాడు. దీనదరిద్రులైన అట్టడుగున వున్న వారిని అక్కున చేర్చుకున్నాడు. అనేకమైన అద్భుతాలు, మానవాతీతమైన పనులూ చేసి తన దైవశక్తిని నిరూపించుకున్నాడు. చివరికి సిలువలో మరణిస్తూ తనను సిలువ వేసిన వారి కొరకు ప్రార్థించాడు. అటువంటి ప్రేమామయుణ్ణి, అటువంటి పుణ్యమూర్తిని, అటువంటి పరిశుద్ధుణ్ణి, అంతటి త్యాగశీలుణ్ణి ఎవరైనా అసలు ఎందుకు ద్వేషించాలి ? బుద్ధుడు, కృష్ణుడు, మహమ్మదు, కన్ఫ్యూజియస్, కార్ల్‌మార్క్స్ వంటి వారిమీద లేని

కోపం, ద్వేషం యేసుక్రీస్తు ప్రభువు మీదే ఎందుకు ? చివరికి రోమ్ పట్టణం తగులబడుతుంటే చూచి పరవశించిపోయి ఫిడేలు వాయిస్తూ ఆనందించిన 'నీరో' అన్నా, లక్షలాది మంది యూదులను ఊచకోత కోసి విషయవాయువు ఉన్న గదుల్లో బంధించి చంపి "పైశాచికత్వానికే పరాకాష్ఠ" అని బిరుదు సంపాదించుకున్న 'హిట్లర్' అన్నా, కోటి మంది నిర్భాగ్యులను సైబీరియా ప్రాంతంలో సజీవంగా పాతిపెట్టిన 'స్టాలిన్' అన్నా లేని కోపం ద్వేషం యేసుక్రీస్తు మీదే ఎందుకు ? ఎందుకు ? ఎందుకు ?

దీనికంతటికీ గల ముఖ్య కారణం యేసు దైవత్వము గలవాడు గనుక. ఆయన అద్వితీయుడు, పైన చెప్పబడిన మతనాయకుల లేక రాజకీయ కోవిదుల జాబితాలో ఒకనిగా చేర్చబడడానికి ఆయన యిష్టపడలేదు గనుక. అసలు ఆయన పైన చెప్పబడిన వ్యక్తుల కోవకు చెందినవాడు కాదు. పాత నిబంధన కాలంలో నేను తప్ప వేరే దేవుడు లేడు, నేను తప్ప వేరొక రక్షకుడు లేడు (యెషయా 43:10; కీర్తన 144:8) అని ప్రకటించిన సర్వాధికారియైన దేవుడే యేసుక్రీస్తుగా అవతరించి "నేను అద్వితీయుడను" అని ప్రకటించాడు. "అల్ఫాయు, ఓమెగయు నేనే. వర్తమాన భూత భవిష్యత్కాలములలో ఉండువాడను నేనే" అని ప్రకటించాడు (ప్రకటన 1:8); 'లోకమునకు వెలుగును నేనే' అని సెలవిచ్చాడు (యోహాను 8:12); 'పరలోకము నుండి దిగివచ్చిన జీవాహారము నేనే' అని బోధించాడు (యోహాను 6:51); 'గొఱ్ఱెలు పోవు ద్వారము నేనే' అని ప్రకటించాడు (యోహాను 10:8); 'నేనే గొఱ్ఱెలకు మంచి కాపరిని' అని సెలవిచ్చాడు (యోహాను 10:11); 'నేనే మార్గమును, సత్యమును, జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు' అని నొక్కి చెప్పాడు (యోహాను 10:6); 'పునరుత్థానమును జీవమును నేనే' అని వక్కాణించాడు (యోహాను 11:25).

ఈ విధంగా బహు దైవత్వానికి ఏ మాత్రం తావులేకుండా, 'మతాలన్నీ ఆ దేవుణ్ణి చేరడానికి మార్గాలు' అనే బహుమత ప్రస్తావనను ఖండిస్తూ 'నేను అద్వితీయుడను' అని యేసు ప్రకటించాడు. గనుకనే యేసంటే కొందరికి మంట. యేసు భక్తులంటే ఎక్కడలేని ఏవగింపు.

అందరిలాగే ఆయన కూడా 'ఎంతోమంది దేవుళ్ళలో యేసు కూడా ఒకడు' అనిపించుకునేందుకు ఇష్టపడివుంటే మనదేశంలో ఆర్యులు కని పెట్టిన బ్రాహ్మణిక మతంలోని కోట్లాది దేవతల జాబితాలో ఈయన కూడా ఒకనిగా చేరివుండేవాడు. బహుదైవత్వాన్నీ, బహుమత సిద్ధాంతాన్నీ ఈయన అంగీకరించి వుంటే మనదేశంలో అనేకుల గృహాల్లో వుండే రకరకాల దేవుళ్ళ, దేవతల ఫోటోల జతన ఈయన ఫోటో కూడా చేరి వుండేది. కాని యేసు అందుకు ఒప్పుకోలేదు. ఎందుచేతనంటే ఆయన ఒక్కడే దేవుడు. ఆయనే నిజ రక్షకుడు గనుక.

యేసునందు నమ్మిక వుంచిన వారుకూడా యేసును అద్వితీయునిగా ఎంచుతారు గనుక దేవుళ్ళనూ, దేవతలనూ పూజించరు. గనుక కొందరికి క్రైస్తవులంటే ఎంతో అసహనం. "మేము మీ దేవాలయానికి వచ్చినప్పుడు మీరు మా గుడికి రావడానికి మీకు అభ్యంతరమేమిటి" అని నిలదీసిన వారితో "మా ప్రభువు అందుకు ఒప్పుకోదు" అని నిష్కర్షగా చెప్పేస్తారు గనుక క్రైస్తవులంటే కొందరికి ఏవగింపు, మరికొందరికి కడుపు మంట.

క్రైస్తవం విదేశీ మతమనీ, ఇది అమెరికా, ఇంగ్లాండు మొదలైన దేశాల నుండి ఈ దేశానికి దిగుమతి చేయబడిన మతమనీ, కనుక ఈ మతం మన 'స్వదేశీ' సంస్కృతికి భంగం కలిగిస్తుందనీ కొందరి అభి ప్రాయం. భారతదేశం బ్రిటీష్ హయాంలో పడిన కడగండ్లను జ్ఞాపకం చేసుకొని ఆ విదేశీ పరిపాలకుల కాలంలోనే ఈ విదేశమతం మనదేశంలో

పాతుకుపోయింది అంటూ క్రైస్తవాన్ని విదేశీయులతో, విదేశీ పరిపాలకులతో ముడిపెట్టి, మనదేశ సంపదనూ, సౌభాగ్యాన్నీ దోచుకున్న ఆ విదేశీ పరిపాలకుల మీద ఉన్న కోపాన్నీ, ద్వేషాన్ని క్రీస్తుమీద, క్రీస్తు భక్తులమీద చూపిస్తూ వుంటారు వీరు. 'మన దేశ సాంప్రదాయబద్ధమైన హైందవ మతధర్మంలో ఇంతమంది దేవుళ్లు, దేవతలూ వుండగా ఎక్కడో విదేశంలో పుట్టి, విదేశీయులచే ఆరాధించబడే యేసును మనం పూజించడం ఏమిటి? ఇది దేశద్రోహం కాదా' అని వీరి వాదన.

ఈ సందర్భంగా నా వాదన కూడా మీరంతా సహృదయంతో, సహనంతో వినాలని సత్యాన్వేషకులందరికీ నా మనవి. ఒక 100 సం॥ల క్రితం మనుష్యులు ఎద్దులబండిలో గంటకు 10-15 కి.మీ. వెళ్తే అది చాలా వేగంగా భావించేవారు. కాని ఒక విదేశీయుడు కారును కనిపెట్టాడు. మరో విదేశీయుడు రైలును కనిపెట్టాడు. ఈనాడు గంటకు 200 కి.మీ. వేగంతో వెళ్ళగలిగిన ఇంపోర్టెడ్ కార్లు మన రోడ్లమీద పరుగులు తీస్తున్నాయి. జపాన్‌లాంటి కొన్ని దేశాల్లో బుల్లెట్ రైళ్ళు గంటకు 400 కి.మీ. వేగంతో పరుగులు తీస్తుంటే భారతదేశ ఆర్థిక వ్యవస్థకే వెన్నెముక లాంటి ఇండియన్ రైల్వేకు కావలసిన శక్తివంతమైన రైలు ఇంజన్లను విదేశాల నుండి మనం దిగుమతి చేసుకుంటున్నాము.

1903 వ సం॥లో విదేశీయులైన రైట్ సోదరులు వారి చిన్న చెక్క రెక్కల విమానంలో కొన్ని గజాలు ఎగిరేంత వరకూ విమానం అంటే ఏమిటో మనకు తెలియదు. కాని ఈనాడు ప్రపంచం నలుమూలల నుండి కొన్ని వందల అధునాతనమైన విమానాలు మనదేశానికి వచ్చి వెళ్తున్నాయి. మనదేశం నుండి ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్, సహారా, జెట్ ఎయిర్‌లైన్స్, సిల్క్ ఎయిర్‌లైన్స్ మొదలగు భారత వైమానిక సంస్థలు

కొన్ని వందల మంది ప్రయాణీకులను ప్రపంచం నలుమూలలకూ చేర్చ, చేస్తున్నాయి. ఈ విమానాలన్నిటినీ మనం ఎంతో ఖరీదు పెట్టి బోయింగ్, ఎయిర్ బస్ మొదలైన విదేశీ సంస్థల నుండి కొనుగోలు చేసినవే. ఈ విధంగా శాస్త్రీయ విజ్ఞానాన్ని, అధునాతనమైన కార్లను, రైలు ఇంజన్లను, విమానాలను దిగుమతి చేసుకోవడం దేశద్రోహమా ?

1876 వ సం॥లో అలెగ్జాండర్ గ్రహంబెల్ అనే విదేశీయుడు టెలిఫోన్‌ను తీగల ద్వారా ఒకరితో ఒకరు మాట్లాడుకోవచ్చు అనే విషయం కనుగొన్న వరకూ ప్రపంచానికి తెలియదు. ఈనాడు తీగల టెలిఫోన్లు పోయి వైర్‌లెస్ ఫోన్లు, సెల్ ఫోన్లు వచ్చాయి. మనదేశంలో అనేక టెలిఫోన్ సర్వీసుల సంస్థలు ఒకదానితో ఒకటి పోటీపడుతున్నా, ఈ సంస్థలు వాడే పరిజ్ఞానం మొదలుకొని ప్రజల చేతుల్లో వున్న సెల్‌ఫోన్ సెట్ల వరకూ అన్నీ విదేశాల నుండి వచ్చినవే. ఒక విదేశీయుడు కనిపెట్టాడు అని టెలిఫోన్‌ను వాడకుండా ఉన్నామా ? లేక టెలిఫోన్‌ను వాడడం దేశ ద్రోహమా ?

తీగలు లేకుండా సంకేతాలు పంపించవచ్చు అని మార్కొని అనే విదేశీ శాస్త్రవేత్త 19వ శతాబ్దంలోనే కనిపెట్టినప్పటికీ గత శతాబ్ది ప్రారంభం వరకు అనగా 1906 డిసెంబర్ 24న రెజినాల్డ్ అనే శాస్త్రవేత్త మొట్ట మొదటిసారిగా ఒక క్రిస్మస్ కార్యక్రమాన్ని ప్రారంభించేంత వరకు రేడియోను గూర్చి ఎవ్వరికీ తెలియదు. మరి ఈనాడు మనదేశంలో ఆకాశవాణి నుండి కొన్ని వందల గంటలు రేడియో కార్యక్రమాలు ప్రసార మవుతున్నాయి. 1929లో జె.యల్. బియర్డ్ అనే విదేశీ శాస్త్రవేత్త దృశ్య తరంగాలను కూడా తీగలు లేకుండా పంపించే విధానం కనిపెట్టేంత వరకూ ప్రపంచానికి టెలివిజన్ అంటేనే తెలియదు. కాని ఈనాడు ఒక్క మీట నొక్కితే చాలు, ప్రపంచంలో ఏ మూలన ఏం జరుగుతుందో మన

కన్నుల ముందు ప్రత్యక్షమవుతుంది.

1948లో హావార్డ్ ఐకెన్స్ అనే విదేశీ శాస్త్రవేత్త హార్వర్డ్ యూనివర్శిటీలో మొట్టమొదటి కంప్యూటర్‌ను నిర్మించే వరకు ప్రపంచానికి కంప్యూటర్ అనే మాటే తెలియదు. కాని ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఆఫీసులోనూ కంప్యూటర్ లేనిదే ఒక్కపని కాదు. వార్‌ప్లేన్ దగ్గర నుండి వాషింగ్ మెషిన్ వరకు అన్నీ కంప్యూటర్ల ద్వారానే నడపబడుతున్నాయి. మన దేశ ఆర్మీకి, రక్షణ వ్యవస్థకు కావలసిన సూపర్ కంప్యూటర్లను, యుద్ధవిమానాలను విదేశాల నుండి కొనుగోలు చేస్తున్నాం. రేడియో, టి.వి. కంప్యూటర్ మొదలైన సాధనాలన్నీ విదేశీయుల ద్వారా రూపొందించ బడ్డాయి. గనుక వాటిని మనదేశంలో వాడడం దేశ ద్రోహమా ?

స్నేహితులారా, సత్యాన్వేషకులారా ! మంచిది ఏదైనా, ఎవరు కనిపెట్టినా, అది ఎక్కడి నుండి వచ్చినా అది సర్వ ప్రపంచానికీ చెందుతుంది. సర్వ ప్రపంచానికీ అందించవలసిన బాధ్యత సమాజం మీద వుంది. సత్యము అనేది కేవలము ఒక ప్రాంతానికి, రాష్ట్రానికి లేక దేశానికి చెందిన విషయము కాదు, కానేరదు. అలాగే సృష్టికర్తయైన దేవుడు ఏదో ఒక గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి చెందినవాడు కాదు, కానేరదు. అలా వుంటే ఆయన దేవుడే కాదు. వీధికొక దేవుడు, ఊరికొక దేవుడు, ఇంటి పేరిట ఒక దేవుడు, దేశానికొక దేవుడు ఉండడానికి వీలులేదు. దేవుడు అనేది ఏదో ముఖ్య మంత్రి లేక ప్రధానమంత్రి పదవికాదు. ప్రజలు ఎన్నుకునే ప్రజాస్వామ్యం అంతకంటే కాదు. దేవుడు అంటూ వుంటే ఆయన సర్వ ప్రపంచానికీ దేవుడే. ఇందులో స్వదేశీ, విదేశీ అనే తేడాలేదు. ఆయన అధికారానికి హద్దులు, ఆయన సార్వభౌమాధిపత్యానికి సరిహద్దులు లేవు. దేవుడు దేవుడే, ఆయన సర్వ ప్రపంచానికీ దేవుడు. ఆయనే యేసుక్రీస్తు అని పవిత్ర

బైబిలు గ్రంథం నొక్కి వక్కాణిస్తోంది. చరిత్ర ఘోషించి ప్రకటిస్తోంది.

యేసుక్రీస్తు ప్రభువు యొక్క అవతరణ ఏదో అనుకోకుండా జరిగిన విషయం కానేకాదు. పవిత్ర బైబిలు గ్రంథములోని పాత నిబంధన ప్రవచనాల నెరవేర్పుగా, అగస్టస్ సీజర్ రోమా చక్రవర్తిగా వున్న దినాల్లో, ఆసియా ఖండములోనే గల పాలస్తీనా దేశములో బెత్లేహేము అనే ఓ కుగ్రామంలో మరియ అనే కన్య గర్భమున యేసుక్రీస్తు అవతరించాడు. యేసు ఈ లోకంలో అవతరించిన రోజున తూర్పున ఆకాశంలో ఓ అద్భుతమైన తార వెలసిందనీ, ఆ నక్షత్రాన్ని ఆధారం చేసుకొని తూర్పుదేశముల నుండి (చైనా, రష్యా, భారతదేశ ప్రాంతాలు) కొందరు జ్ఞానులు పాలస్తీనా వెళ్ళి బాలయేసును ఆరాధించారనీ చరిత్రకారులు ఎంతో వివరంగా వ్రాశారు. యేసు రాకతో నింగినేలా కలుసుకున్నాయి. యేసు అవతరణ మానవతనే మార్చివేసింది. యేసు బోధలు మానవ మనుగడలో ఒక తిరుగులేని విప్లవాన్ని సృష్టించాయి.

యేసు బోధించిన దైవరాజ్య సువార్తను అందుకున్న తొలిదేశాల్లో భారతదేశం కూడా ఒకటి. క్రైస్తవం ఎంత పురాతనమైందో, భారత క్రైస్తవ సంఘం కూడా అంతే పురాతనమైంది. యేసు యొక్క శిష్యులలో ఒకడైన తోమా మన భారత భూగడ్డమీద హతసాక్షిగా మరణించాడు. అనతికాలంలోనే క్రైస్తవం ప్రపంచ వ్యాప్త మత విశ్వాసంగా వర్థిల్లింది. ఈనాడు ప్రపంచ జనాభాలో మూడవ వంతు ప్రజలు క్రీస్తు భక్తులే అంటే కొందరికి ఆశ్చర్యం కలుగవచ్చు. అయితే ప్రపంచంలో ఇంతమంది యేసుక్రీస్తు ప్రభువును రక్షకునిగా, దేవునిగా ఎందుకు నమ్ముతున్నారు ? ఎందుకు నమ్ముకుంటున్నారు ?

ప్రపంచంలో మరి ఏ వ్యక్తి చెప్పని, చెప్పలేని, మానవ జాతి యావత్తుకూ ఆనందాశ్చర్యాలు కలిగించే అధికారంతో కూడిన మాటలు చెప్పాడు యేసు. "అబ్రాహాముకు ముందే నేను వున్నాను" (యోహాను 8:58) అన్నాడు. (అబ్రాహాము క్రీ.పూ. 2000 సం॥ల కాలంలో జీవించిన వ్యక్తి). "నేనే క్రీస్తును" అని తెలియజేశాడు (యోహాను 4:21). "నేనే లోకమునకు వెలుగును" అని సెలవిచ్చాడు (యోహాను 8:12). "నేను యోనా కంటే గొప్పవాడను' అన్నాడు (మత్తయి 12:41). "నేను దేవాలయము కంటే గొప్పవాడను" అని సెలవిచ్చాడు (మత్తయి 12:6). 'నేను సొలొమోను కంటే గొప్పవాడను అని ప్రకటించాడు (మత్తయి 12:42). 'నాలో పాప మున్నదని మీలో ఎవడు స్థాపించును?' అని సవాలు చేశాడు (యోహాను 8:46). 'నను చూచినవాడు దేవుని చూచినట్లే' అన్నాడు (యోహాను 9:35, 36).

"నా గొర్రెల కొరకు ప్రాణము పెట్టుచున్నాను" అన్నాడు (యోహాను 10:15). 'నా ప్రాణము పెట్టుటకును దానిని తిరిగి తీసుకొనుటకును నాకు అధికారము కలదు' అన్నాడు (యోహాను 10:18). 'నా యందు విశ్వాస ముంచినవాడు చనిపోయినను తిరిగి బ్రతుకును' అన్నాడు (యోహాను 11:25). "పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారమున్నది" అని ప్రకటించాడు (మత్తయి 28:18). 'నేను మరలా తిరిగి వస్తాను' అన్నాడు (యోహాను 14:1-3). ఈ విధంగా మానవాతీతమైన అధికారంతో, మానవజాతి యావత్తూ విస్మయపోయేటువంటి మాటలు పలికిన యేసును ఏమనాలి ? మానవుడందామా, లేక దేవుడందామా ? 'అయ్యో పిచ్చివాడు' అని ప్రక్కన పెడదామా, లేక 'ఆకాశానికి భూమికి అధికారి' అని సాష్టాంగ పడదామా ?

ప్రపంచంలో ఎవ్వరూ చెయ్యని, చెయ్యలేని అత్యంత భయాన్ని పుట్టించు అద్భుతాలను చేశాడు యేసు. గ్రుడ్డివారికి చూపునిచ్చి, కుంటి వారిని నడిపించి, కుష్ఠరోగులను, మరణకరమైన వ్యాధులలో మగ్గిపోతున్న వారిని బాగుచేసి మానవ శరీరం మీద తనకు పరిపూర్ణ అధికారమున్నదని నిరూపించాడు. సముద్రమును గద్దించి, గాలి తుఫానును మాటతో నిమ్మళింపజేసి, నీటిమీద నడచి, ఐదు రొట్టెలు, రెండు చేపలను ఐదువేల మందికి పంచిపెట్టి ప్రకృతి మీద తనకున్న అధికారాన్ని చాటిచెప్పాడు యేసు. అపవిత్రాత్మలచే పీడింపబడుచున్న వారికి విడుదలనిచ్చి, దయ్యములను పారద్రోలి సాతాను శక్తులమీద తనకున్న అధికారాన్ని ఋజువు చేశాడు యేసు. మరణించిన వారిని తిరిగిలేపి, తానే మరణించి తిరిగి లేచి, మరణం మీద మృతులలోకం మీద తనకు సర్వాధికారమున్నదని నిరూపించుకున్నాడు యేసు. ఇటువంటి మహా అద్భుతములను, మహాత్కార్యములను చేసిన యేసును ఏమందాం ? మానవుడందామా లేక దేవుడందామా ? ఇటువంటి మాటలు చెప్పినవారు గాని, యేసు చేసిన పనులు చేసినవారు గాని ప్రపంచ చరిత్రలో ఇంకెవరైనా వున్నారా ? ఉన్నారా ? ఉన్నారా ?

ప్రపంచ చరిత్రను, మానవజాతి మనుగడను యేసు అనబడే ఈ దైవమానవుడు, మానవావతారిగా వచ్చిన మహాదేవుడు ప్రభావితం చేసి నట్లుగా మరి ఏ రాజూ, ఏ చక్రవర్తి, ఏ నాయకుడు, దేవుళ్ళనీ, దేవతలనీ పిలువబడుతున్న వారిలో ఏ ఒక్క వ్యక్తి ప్రభావితం చేయలేదు అంటే అది అతిశయోక్తి కాదు. ప్రపంచ చరిత్రకే ఆయన పురోహితుడు, కాలానికే ఆయన అధికారి. ఆయన రాక కాలాన్నే రెండుగా విభజించింది (క్రీస్తుకు పూర్వం - క్రీస్తు శకం). ఈనాడు మన గోడల మీద వ్రేలాడుతున్న కాలెండరులో 2003 అని వ్రాయబడి ఉంది. అంటే ఆ మహాదేవుడు ఈ

లోకంలో అవతరించి ఇప్పటికి 2003 సంవత్సరములు అని అర్థము. యేసు సృష్టించిన ప్రపంచంలో మనమున్నాం. ఆయన సృష్టిలో మనమంతా ఒక భాగం. ఆయన శకంలో మనం జీవిస్తున్నాం. ఆయన చేత సృష్టించ బడిన మనము ఆయన సార్వభౌమాధిపత్యాన్నే సవాలు చేయడం న్యాయమా? ఆయన ప్రసాదించిన ఆయుష్కాలాన్ని అనుభవిస్తూ ఆయన అధికారాన్ని ధిక్కరించడం తగునా ?

యేసుక్రీస్తు ప్రభువు షేక్స్‌పియర్, మిల్టన్ లాంటి మహాకవుల కోవకు చెందినవాడు కాదు. ఆయన కవులకే కేంద్రబిందువు, కవిత్వానికే మూలాంశం. యేసు తన సిద్ధాంతాల్ని, బోధల్ని ప్రచారం చేసేందుకు ఒక్క పుస్తకం కూడా వ్రాయలేదు. కాని ప్రపంచంలో ఆయనను గూర్చి వ్రాయ బడినన్ని పుస్తకాలు మరి ఏ వ్యక్తిని గూర్చి వ్రాయబడలేదు. ఆయన జీవనరాగానికే ప్రేరణ. కవుల కమనీయ కవిత్వానికే ఆలాపన. ఆయన ఈ లోకంలో అవతరించి దాదాపు రెండువేల సంవత్సరాలవుతున్నా ఆయనను గూర్చిన వ్రాతలు ముగియలేదు. పాటలు ఆగిపోలేదు 'యేసు' ముఖ్యాంశంగా దినదినమూ కొన్ని వందల వేల పుస్తకాలు అచ్చవుతూనే వున్నాయి. ప్రతి రోజూ కొన్ని కోట్ల నాలుకలు ఆయనను ప్రస్తుతిస్తూనే వున్నాయి.

యేసుక్రీస్తు ప్రభువు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన శాస్త్రవేత్తలలో ఒకడుకాదు. ఆయన ప్రపంచానికే సృష్టికర్త. శాస్త్రవేత్తలనే సృష్టించిన సర్వజ్ఞాని, శాస్త్రీయ విజ్ఞానానికి మించినవాడు. ఆయన చేసిన అద్భుతాలను ఏ సైన్సూ వివరించలేదు. ఆయన మాటతో పుట్టు గ్రుడ్డివాడు చూచాడు. ఆయన ఆజ్ఞాపింపగా కుంటివాడు లేచి గంతులు వేశాడు. ఆయన గద్దింపగా సముద్రమే గడగడలాడింది. ఆయన పిలువగా చనిపోయినవారు సమాధులలో నుండి బయటికి వచ్చారు. ఆయన కనుచూపుతో నీరు

ద్రాక్షరసంగా మారిపోయింది. ఆయన వస్త్రపు చెంగు ముట్టిన రక్తస్రావరోగి బాగుపడింది. ఇటువంటి మానవాతీతమైన అద్భుతములను జరిగించిన మహాదేవుడైన యేసును నమ్ముకోవడం నేరమా ? న్యాయ దూరమా ? దేశ ద్రోహమా ?

చివరికి సర్వమానవ పాప పరిహారార్థం సిలువలో ఆయన తనను తాను అప్పగించుకున్నప్పుడు ప్రకృతే మూగవోయింది. పట్టపగలే చీకటి కమ్మింది. యేసు మరణించి, మరణాన్నే జయించి తిరిగి లేవడంతో సర్వ ప్రపంచం నిర్ఘాంతపోయింది. మరణం ఆయనను బంధించలేకపోయింది. ఆయన సైన్సుకూ, శాస్త్రీయ విజ్ఞానానికీ అతీతుడు. శాస్త్రీయ విజ్ఞానంతో యేసును అర్థం చేసుకోవాలనుకోవడం కేవలం అర్థరహితం. అందుచేతనే సర్. ఐజక్ న్యూటన్, మైకెల్ ఫేరడే, జేమ్స్ సింప్సన్, వాషింగ్టన్ కార్వర్, జేమ్స్ క్లెర్క్ మేక్స్‌వెల్, లార్డ్ కెల్విన్, సర్ జాన్ ఆండ్రూస్ ఫ్లెమింగ్, సామ్యుల్ మోర్స్, జోహాన్నాస్ కెప్లర్, రాబర్ట్ బోయిల్ మొదలైన ప్రపంచ ప్రఖ్యాతి చెందిన శాస్త్రవేత్తలు యేసు పాదాల చెంత ప్రణమిల్లి “మా ప్రభూ, మా రక్షకా” అని ఆయనను పూజించారు. సర్వజ్ఞాని, సర్వ ప్రపంచానికే ఆధారభూతుడు అయిన యేసును ఆరాధించి ధన్యులయ్యారు.

యేసుక్రీస్తు ప్రపంచంలోని గొప్ప ధనికులలో ఒకడు కాదు. ఆయన ఈ ప్రపంచానికే యజమాని. మనం పీల్చుకుంటున్న గాలి, మనం తింటున్న ఆహారం, మనముంటున్న భూమి ఇవన్నీ ఆయనవే. అసలు మనకు ప్రాణ మిచ్చినవాడు, శరీరమిచ్చినవాడు, ఈ జీవితము నిచ్చినవాడు ఆయనే. అయితే ఆయన తన ప్రజల కొరకై తన పరలోక మహిమనే విడిచివచ్చిన ప్రపంచ చక్రవర్తి. ఎక్కడో రాజవంశంలో అవతరించలేదు. కాని బహు దీనుడిగా ఒక పశువుల పాకలో జన్మించాడు. ఎక్కడో నజరేతు అనే ఒక

కుగ్రామంలో పెరిగాడు. 30 సం॥ల వయసు వరకూ వడ్రంగి పని చేశాడు. పేదలనూ, దీన దరిద్రులనూ చూచి చలించిపోయాడు. బాధితులనూ, అట్టడుగున వున్న వారినీ అక్కున చేర్చుకున్నాడు. మనుష్యులలో ఒక మనిషిగా మెలిగాడు. ఆకలిగొన్నాడు, దప్పిగొన్నాడు, అలసిపోయాడు. చివరికి ఆకాశానికి భూమికి మధ్య సిలువలో తన ప్రాణాన్నే బలిచేశాడు. ఎవరో తొలిపించుకున్న రాతి సమాధిలో భూస్థాపితం చేయబడ్డాడు. కాని ఆయన అనుభవించిన ఆ కటిక దారిద్ర్యం వలన, ఆయన పొందిన సిలువ మరణం వలన ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని కోటీశ్వరులనుగా అనగా నిత్య జీవానికే వారసులుగా మార్చివేశాడు. ఆయనలో వున్న పాప క్షమాపణ, ఆయన ఇచ్చే మనశ్శాంతి, ఆయన చూపించే ప్రేమ డబ్బుతో కొనగలిగేవి కావు. ప్రపంచంలో వున్న బంగారం, ధనము, వెలగల రాళ్ళు అన్నీ కలిపినా ఆయన యిచ్చే ఆనందానికి సరిపోవు.

యేసు ఏ రాజ్యాలనూ, దేశాలనూ జయించలేదు. ఎన్నో దేశాలను జయించిన నెపోలియన్, అలెగ్జాండర్ మొదలైన వారికున్న సైన్యమూ, మంది మార్బలమూ యేసుకు లేవు. కాని సిలువలో ఆయన చూపించిన ప్రేమ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల హృదయాలను జయించి తన సొంతం చేసుకున్న రాజాధిరాజు యేసు. అందుకే ఈనాడు జాతి, మత, కుల విచక్షణ లేకుండా అందరూ యేసువైపు మళ్ళుతున్నారు. యేసునే నమ్ముకుంటున్నారు, యేసు భక్తులుగా మారిపోతున్నారు. మనః శ్శాంతికోసం ఎక్కడెక్కడో తిరిగి, ఏవేవో చేసిన మానవజాతి ప్రపంచంలో 'యేసు' తప్ప మరేదీ మనిషికి నెమ్మదిని చేకూర్చలేదు అనే సత్యాన్ని గుర్తెరిగి అందరూ యేసు రక్షకుణ్ణి ఆశ్రయిస్తున్నారు. యేసు మత స్థాపకుడు కాదు, రాజకీయ నాయకుడు అంతకంటే కాదు. యేసును నమ్మడం అంటే మతం

మార్చుకోవడం కాదు. యేసును నమ్ముకోవడం అంటే సృష్టికర్తయైన దేవునితో అనుసంధానం కావడమే. యేసును స్వీకరించడం అంటే జీవితాన్ని నూతనంగా ప్రారంభించడం. యేసును వెంబడించడం అంటే దేవుని మహిమలోనికి ముందడుగు వేయడమే.

ప్రపంచ చరిత్రలో ఎందరో రాజులు, నాయకులు, మేధావులు వచ్చారు, వెళ్ళిపోయారు. వారి అనుచరులు కూడా వారితోనే వెళ్ళిపోయారు. ప్రపంచ మనుగడ మీద వారి ప్రభావం కూడా వారితోనే అంతమైపోయింది. కాని ఇప్పటికి దాదాపు 2000 సం॥ల క్రితం మానవతను ఉద్ధరించడానికి అవతరించిన యేసు ప్రారంభించిన ముక్తి ఉద్యమం ఇంకా కొనసాగుతూనే ఉంది, అంతకంతకూ ఉధృతమవుతూనే ఉంది. ఎందుచేత నంటే ఆనాటికీ, ఈనాటికీ, ఏనాటికీ మానవ మనుగడ యొక్క కేంద్ర బిందువు యేసే.

యేసు లేనిదే పాప క్షమాపణలేదు. యేసు లేనిదే హృదయానికి నెమ్మదిలేదు. యేసులేనిదే ప్రపంచానికి నిరీక్షణలేదు. యేసు లేనిదే అసలు ఈ ప్రపంచమే లేదు. ఆయనే రక్షకుడు, ఆయనే దేవుడు, ఆయనే సృష్టికర్త. ఆయనే తిరిగి రాబోవుచున్న ప్రపంచ న్యాయాధినేత. ఆయనతో ఎవ్వరిని పోల్చలేము. ఆయనకు ఎవ్వరూ సమానం కాదు. ఆయన అద్వితీయుడు. యేసుక్రీస్తు ఒక కులానికి, జాతికి లేక దేశానికి పరిమితమైనవాడు కాదు. ఆయన ప్రపంచానికే అధికారి, సర్వమానవ కోటిని పాపము నుండి, పాప శాపముల నుండి విడిపించ గల సత్యదేవుడు. ఒకే నిజ రక్షకుడు, అందరికి ప్రభువు.

ప్రార్థన

"ఓ క్రీస్తూ ! దయానిధీ ! నేను గొప్ప పాపిని, నేను చేసిన పాపములను క్షమించు, నేను పాపములను ద్వేషించి, నీ చిత్తము చొప్పున నడుచుకొందును; నన్ను కృపతో చూచి, నీ పరిశుద్ధాత్మను దయచేసి, నన్ను నడిపించుము."

ఆశీర్వాదము

అద్వితీయ సత్యదేవుని ప్రేమ, రక్షకుడయిన క్రీస్తువారి కృప, పరిశుద్ధాత్మ నిత్యసన్నిధి సహవాసము మనందరకు తోడైయుండును గాక !

"సత్యమేవ జయతే"

సర్వేజనాః సుకినోభవంతు

ఓం శాంతి శాంతి శాంతిః